



• కలువల చెరువులో బీరు కాయలు



నోరారా తాగే నీరు
పైపైన వాలే పిట్టలు
లోలోన ఈదే చేపలు
కలువలు విప్పారిన చేలు
సుమధుర సుందర తటాకం..!
ఆంగ్లమున ఎస్ఎస్ ట్యాంక్ అందురు..!



ఈ సిగ్గులు తొడిగే
కసి మొగ్గల నడుమ..
బీరు కాయడమేమిటి..
సిగ్గులేకుండా.. ఏమాత్రం..!



- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

(అనంతపురం నగర శివారులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు)

కొత్త కొత్తగా...



జేఎన్టీయూ ఫార్మసీ కళాశాలకు మహర్దశ



నిర్మాణంలో ఉన్న బాలిక హాస్టల్ భవనం

నూతనంగా హాస్టల్స్.. ఫార్మసీ బ్లాక్ భవనాల నిర్మాణం

వేగంగా సాగుతున్న పనులు.. విద్యార్థుల హర్షం



అధునాతన హంగులతో నిర్మిస్తున్న ఫార్మసీ బ్లాక్

అనంతపురం సెంట్రల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆయిల్ టెక్నలాజికల్ అండ్ ఫార్మాసూటికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఓటీపీఆర్ఐ) నూతన శోభను సంతరించుకోనుంది. విద్యార్థులను వేధిస్తున్న భవనాల కొరత త్వరలోనే తీరనుంది. క్యాంపస్‌లోనే బాల, బాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ భవనాలను యాజమాన్యం నిర్మిస్తోంది. వీటితోపాటు అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ కార్యకలాపాలకు ఫార్మసీ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు. ఈ మూడు భవనాలకు సంబంధించి అత్యధిక శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయించడానికి అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

700మంది విద్యార్థులు

నాలుగు సంవత్సరాల బీఫార్మసీలో వంద, ఆరు సంవత్సరాల ఫార్మా-డీ, రెండు సంవత్సరాల కోర్సులైన ఎంఫార్మసీ, ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీలో 30 చొప్పున కళాశాలలో సీట్లు ఉన్నాయి. వీటికి అదనంగా పదిశాతం ఈడబ్ల్యుఎస్, లేటర్ ఎంట్రీ ద్వారా మరో 50మందికి అవకాశాన్ని ఇస్తున్నారు. ఇలా ప్రతి ఏడాది దాదాపు 700మంది విద్యార్థులు ఓటీపీఆర్ఐ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కోర్సులు పూర్తి కాలంలో 10నుంచి 20 ల్యాబ్‌లు, ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. వీటికి అదనంగా సబ్జెక్టుల వారిగా అవసరమైన అంశాలపై లైబ్రేరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు వినియోగించుకోవాలి. ఇలా అకడమిక్, ల్యాబ్‌లు, లైబ్రేరీలకు పదుల సంఖ్యలో వసతులతో కూడిన సరిపడా గదులు ఉండాలి. అరకొర వసతుల మధ్యనే ఇప్పటివరకు విద్యను కొనసాగిస్తున్నారు. ఈ సమస్యలకు ముగింపు పలికేలా మరికొన్ని నెలల్లో అన్నిరకాలుగా సంపూర్ణ వసతులు కల్పించేలా జేఎన్టీయూ నూతన యాజమాన్యం చర్యలు తీసుకుంది.



ప్లాస్టింగ్ పనులు పూర్తి అయిన బాలుర వసతి గృహం

క్యాంపస్‌లోనే హాస్టళ్లు...

ఓటీపీఆర్ఐ కళాశాలలో ఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులకు రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ ఉంది. రాయలసీమ, కోస్తా ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడకు వస్తున్నారు. అయితే ఓటీపీఆర్ఐలో హాస్టల్ వసతి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, కమలానగర్, సాయినగర్, విద్యుత్‌నగర్ ఇలా వివిధ ప్రాంతాల్లోని ప్రైవేట్ హాస్టళ్లలో వసతి పొందుతున్నారు. వారు ఉంటున్న హాస్టళ్ల నుంచి తరగతుల ప్రారంభ సమయానికి కళాశాలకు చేరుకోవడం సమస్యగా మారింది. ఈ క్రమంలో ఎప్పుడేమి జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కళాశాల క్యాంపస్‌లోనే బాల, బాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ భవనాలు నిర్మాణం అవుతుండటంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భయం, భయంగా..: నిఖిత, విద్యార్థిని



కాలేజ్ క్యాంపస్‌లో హాస్టల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఓటీపీఆర్ కళాశాలలోనే ఫార్మసీ కోర్సు బాగుంటుందని చేరా. మా గ్రామానికి అనంతపురం నగరం దాదాపు 80 కిలోమీటర్ల దూరం. రోజు వచ్చిపోవాలంటే సాధ్యంకాని పని. అందుకే ప్రైవేట్ హాస్టల్లో ఉంటున్నా. ఈ క్రమంలో హాస్టల్ నుంచి కళాశాలకు వచ్చి పోవడానికి భయం భయంగా ఉంటోంది. మా భద్రతను దృష్టిలో పెట్టుకుని క్యాంపస్‌లోనే హాస్టల్ భవనాలు నిర్మిస్తుండటం సంతోషం.

పరుగు పరుగున...: మీనాక్షి, విద్యార్థిని



మూడేళ్లుగా ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నా. క్లాసులు, ల్యాబ్‌లకు సమయానికి హాజరుకావాల్సిందే. ఉదయం టిఫిన్ చేసి హాస్టల్‌నుంచి పరుగు పరుగున రావాల్సి వస్తోంది. ఇక మధ్యాహ్న భోజనానికి సమయం ఉంటే వెళ్తాం లేదంటే లేదు. త్వరలోనే హాస్టల్ సమస్యలు తీరబోతుండటం ఆనందంగా ఉంది.

వేగంగా పనులు...

రూ.22కోట్లతో ఓటీపీఆర్ఐ కళాశాల క్యాంపస్‌లో ఫార్మసీ బ్లాక్, బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలను నిర్మిస్తున్నారు. ఈ మూడు భవన నిర్మాణాలు దాదాపు స్లాబ్‌వరకు పనులు పూర్తిచేశారు. మిగిలిన పనులు త్వరగా చేయించేందుకు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. షిఫ్టుల వారిగా 24గంటలు కార్మికులు పనిలో ఉండి నిర్మాణాలను వేగవంతం చేయిస్తున్నారు. ఒక్కో హాస్టల్ భవనంలోని మూడు అంతస్థుల్లో 70 చొప్పున గదుల్లో విద్యార్థులు వసతి పొందేలా నిర్మిస్తున్నారు. విశాలమైన దాదాపు 40 తరగతి గదులు, అడ్మినిస్ట్రేషన్, ల్యాబ్ వంటి కార్యకలాపాలకు అనుగుణంగా ఫార్మసీ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు. మరో ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలో తీసుకువచ్చేలా కృషి చేస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సెక్యూరిటీ ఉంటుంది: లిఖిత, విద్యార్థిని



ప్రైవేట్ హాస్టళ్లలో నెలకు రూ.5వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. కాలేజ్ క్యాంపస్‌లో అయితే అన్నిరకాల మెనూ కలిపినా రూ.3వేలకు మించదు. క్లాసులు, ల్యాబ్‌లకు సమయానికి వెళ్లవచ్చు. ఉదయం, సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవచ్చు. ముఖ్యంగా బాలికలకు సెక్యూరిటీ ఉంటుంది. విద్యార్థుల తల్లిదండ్రులు కంగారు పడాల్సిన అవసరముండదు.

విద్యార్థుల భద్రత మాదే



జేఎన్టీయూలో చదవాలన్న ఆకాంక్షతో అనేక ప్రాంతాలు, జిల్లాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. వారికి భద్రత కల్పించడం మా బాధ్యత. నగర నడిబొడ్డున, కలెక్టరేట్‌కు ఆనుకుని కళాశాల ఉండటంతో అన్నింటకి సౌకర్యంగా ఉంటుందని తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పిస్తున్నారు. క్యాంపస్‌లోనే బాల, బాలికలకు వేరువేరుగా హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నాం. అధునాత వసతులు, సౌకర్యాలతో కూడిన ఫార్మసీ బ్లాక్ భవనం ఏర్పాటు కాబోతుంది. వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ సహకారంతో కొన్ని నెలలలోనే అందుబాటులోకి తెస్తాం.

- ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్

రూ.22కోట్లతో..



విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడం కోసం రూ.22కోట్ల నిధులు వెచ్చించి నూతన భవనాలు నిర్మిస్తున్నాం. వర్సిటీ, పీసీఐ నిబంధనల మేరకు క్యాంపస్‌లోనే హాస్టళ్లు ఉండేలా నిర్మాణాలు చేపట్టాం. ఇప్పటికే స్లాబ్‌వరకు భవనాలు పూర్తి చేశాం. మిగిలిన పనులు వేగంగా సాగేలా చర్యలు తీసుకున్నాం.

- ప్రొఫెసర్ కృష్ణయ్య
జేఎన్టీయూ రిజిస్ట్రార్

ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్



ఆవిర్భావ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పిఠాపురంలో ఈనెల 14న నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. నగరంలోని యాదవ కల్యాణమండపంలో ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీసీ వరుణ్ మాట్లాడుతూ అనంతపురం పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నగర కమిటీల నాయకులు, కార్యకర్తలు ఆవిర్భావ దినోత్సవంలో సైనికుల్లా పనిచేయాలన్నారు. జిల్లా నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, శింగనమల ఇన్‌చార్జ్ సాకే మురళీ, తాడిపత్రి ఇన్‌చార్జ్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు మణికంఠ, గౌతమ్, బాల్యం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సొమ్ము చోరీ



బీరువాను పగులగొట్టిన దొంగలు

కణేకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సొల్లాపురంలో రామాలయ నిర్మాణం కోసం సిద్ధం చేసుకున్న రూ.12 లక్షల నగదును సోమవారం అర్ధరాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామస్థులు కణేకల్లు సీఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆలయ నిర్మాణం కోసం గ్రామస్థులు రూ.4 కోట్లకు పైగా చందాలు వేసుకున్నారు. గ్రామ పెద్ద లక్ష్మణ్ చౌదరి వద్ద ఈ మొత్తాన్ని ఉంచి ఖర్చు చేస్తున్నామని వారు తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామస్థులు కొందరు తమ వాటాగా ఇచ్చిన రూ.12 లక్షలను లక్ష్మణ్ చౌదరికి ఇచ్చామని తెలిపారు. ఆయన సోమవారం అనంతపురం వెళ్లారని, అర్ధరాత్రి ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడి నగదును ఎత్తుకుపోయారని తెలిపారు. ముగ్గురు వ్యక్తులు అర్ధరాత్రి గ్రామంలోని హనకనహాళ్‌లో రోడ్డులో ఉన్న లక్ష్మణ్‌చౌదరి ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లినట్లు సీసీ కెమెరాలలో రికార్డు అయిందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఒంటిపూట.. ఉర్దూ బడి

అనంతపురం విద్య, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం నేపథ్యంలో జిల్లాలోని ఉర్దూ పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు మాత్రమే తరగతులను నిర్వహించాలని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ఆదేశించారు. విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకూ ఉర్దూ ప్రైమరీ, యూపీ, హైస్కూళ్లలో సమయాన్ని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ మారుస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు అమలు చేయాలని సూచించారు.

సెమీ సంబరం








క్లాక్ టవర్ వద్ద అభిమానుల సంబరాలు

చాంపియన్స్ ట్రోఫీ సెమీ ఫైనల్‌లో భారత జట్టు విజయం సాధించడంతో అనంతలో అభిమానులు మంగళవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. జాతీయ పతాకాలను చేతబట్టుకుని క్లాక్ టవర్ సమీపంలో 'జయహో భారత్' అంటూ నినాదాలు చేశారు. యువకులు బైకులపై చక్కర్లు కొడుతూ సందడి చేశారు. ఇదే ఊపులో ఫైనల్స్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్

రాప్తాడు చెరువులకు నీరందించండి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ద్వారా తన నియోజకవర్గంలోని 38 చెరువులకు నీరందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆమె సీఎంను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. హంద్రీనీవా రెండో దశ లైనింగ్ పనులు చేయడం ద్వారా రాప్తాడు నియోజకవర్గంలోని 38 చెరువులకు నీరందే అవకాశం లేకుండా పోతుందన్నారు. భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీరందేలా తూములను ఏర్పాటు చేయడం, కాలువ సమీపంలో వంకలపై ఉన్న చెక్‌డ్యామ్‌లకు నీరందించేలా తూములు ఏర్పాటు చేయాలని కోరారు. కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలను నిర్మించాలని విన్నవించారు. రాప్తాడులో 70 వేల ఎకరాలకుపైగా హంద్రీనీవా పరిధిలో ఆయకట్టు ఉందన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ రాప్తాడు నియోజకవర్గ రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని, చెరువులకు నీరందించే విషయంలో రాజీ ఉండదని హామీ ఇచ్చినట్లు పరిటాల సునీత తెలిపారు.



ఇఫ్తార్	సెహరీ
6.30	5.17
బుధవారం సాయంత్రం	గురువారం ఉదయం

రంజాన్ వేళలు



ఉష్ణోగ్రతలు
మంగళవారం

గరిష్ఠం	38.0
కనిష్ఠం	23.0



క్లాక్ టవర్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్

సొంతం

కొందరి చేతుల్లోనే ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు

- 25 ఏళ్లకుపైగా పాతుకుపోయిన వైనం
- షాపు దక్కించుకుని బయటి వ్యక్తులకు అప్పగింత
- రూ.లక్షల్లో అడ్వాన్సులు, రూ. వేలల్లో బాడుగల ఆర్జన

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న దుకాణాలు కొందరి కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. రెండున్నర దశాబ్దాలుగా వాటిలో తిష్ట వేసి, అద్దె కూడా చెల్లించకుండా కాలం గడుపుతున్నారు. ఎవరైనా అధికారులు గట్టిగా అడిగితే కుల సంఘాలు, రాజకీయ నాయకుల పేర్లతో వారిపై తిరగబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ షాపింగ్ కాంప్లెక్స్ షాపులు కేటాయించే సమయంలో ఎన్నేళ్లకోసారి టెండర్లు నిర్వహించాలి? ఎన్ని సంవత్సరాలు లీజు అనే అంశాలను పొందుపరచక పోవడం వల్లే వారి ఆగడాలు సాగుతున్నట్లు సమాచారం. క్లాక్‌టవర్, కలెక్టరేట్‌లో సమీపంలో ఉన్న కాంప్లెక్స్‌లలో షాపులు దక్కించుకున్న కొందరు సంఘాలను, రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకొని ఐదారు షాపులను వారి వారి కుటుంబసభ్యులకు ఇప్పించుకున్నట్లు తెలుస్తోంది. కలెక్టర్, జేసీ స్పందించి ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని దుకాణాలకు టెండర్లు నిర్వహించి, కొత్తవారికి అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్



ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని నగరంలో క్లాక్‌టవర్, కలెక్టరేట్ సమీపంలో 40 దుకాణాలను నిర్మించారు. అప్పట్లో వీటికి నెలకు రూ. 250లు చొప్పున బాడుగలు నిర్ణయించారు. ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్, టెండర్లు నిర్వహించేలా అప్పటి ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే నేటి వరకూ షాపులు రెన్యువల్ చేయలేదు. టెండర్లు ఆహ్వానించ

ఎస్సీ కార్పొరేషన్ ఆదాయానికి భారీ గండి

లేదు. దీంతో 25 ఏళ్ల కింద ట నిర్ణయించిన రూ. 250లు బాడుగనే కొందరు చెల్లిస్తుండగా... మరి కొందరు ఆ బాడుగను కూడా సక్రమంగా చెల్లించనట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో మాత్రం ఇతర వ్యక్తులకు షాపులు అప్పగించి ఒక్కోదాని నుంచి రూ. 2 లక్షలు అడ్వాన్సులు, నెలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు బాడుగలు తీసుకుంటూ ఎస్సీ కార్పొరేషన్ ఆదాయానికి భారీస్థాయిలోనే గండి కొడుతున్నట్లు సమాచారం.

ఎక్కువ అద్దెకు బయటి వ్యక్తులకు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1997, 2002, 2005 సంవత్సర కాలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద దాదాపు 200కుపైగా దుకాణాలను నిర్మించింది. ఒక్కో నియోజకవర్గంలో దాదాపు 10, 15 షాపులు చొప్పున ఆమోదం తెలిపి నిర్మించారు. దుకాణాలన్నీ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ జిల్లా సెలెక్షన్ కమిటీ కింద కలెక్టర్‌కు ఎంపిక ప్రక్రియను అప్పగించారు. షాపులు అప్పగించే సమయంలో బాడుగ చెల్లించడంలో మూడు నెలల వరకూ గడువు ఉంటుందని.. అప్పటికీ ఎవరైనా చెల్లించక పోతే నోటీసులిచ్చి ఆ షాపును మరొకరికి అప్పగిస్తామని పొందుపరిచినట్లు అధికార వర్గాల సమాచారం. అప్పట్లో దుకాణాలను దక్కించుకున్న వారి పేర్లు కార్పొరేషన్ రికార్డుల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో చూస్తే 70 శాతం మంది బయటి వ్యక్తులే దుకాణాల్లో దర్శనమిస్తున్నారు. షాపు దక్కించుకుని, బయటి వ్యక్తులకు ఎక్కువ అద్దెకు ఇచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నగర నడిబొడ్డులో ఉండటం, వాణిజ్య పరంగా డిమాండ్ ఉండటంతో ఒక్కో దుకాణానికి రూ. లక్షల్లో అడ్వాన్స్‌లు తీసుకుంటూ, నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకూ అద్దెలు తీసుకుంటూ బయటి వ్యక్తుల అప్పగించారన్న విమర్శలున్నాయి. ఎవరైనా అధికారులు తనిఖీలకెళ్లినప్పుడు వారంతా తమవారే అంటూ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



కలెక్టరేట్ పక్కన గల ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు



పరిశీలిస్తున్నాం

నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో కొంత మంది అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు. ఇటీవల మాల కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్ షాపులను పరిశీలించిన సందర్భంలో ఈ విషయం బయటపడింది. బినామీలు ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. అయితే వీటన్నింటిని పరిశీలిస్తున్నాం. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం.


- రాధిక, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ

జట్కావాలా..

గుర్రపు డెక్కల శబ్దం
వినిపించినా..
జట్కా బండి వచ్చి.. ఆగినా..
ఊరి జనం చూపంతా.. అటే..
వారి కళ్లన్నీ బండిపైనే..
అందులోంచి దిగేవారు..
రాజ కుటుంబీకులో..
భూసాములోనని..
ఆతృతగా చూసేవారు..
ఆ ఠీవి వేరు..
గత వైభవానికి గుర్తుగా..
ధర్మవరంలో ఓ జట్కా బండి..
నేటికీ తిరుగుతోంది..
ఆంగ్లేయులను
మెప్పించిన బండి అంటూ..
మురిసిపోతున్నాడు యజమాని..
80 ఏళ్ల జట్కా స్టాండు స్మృతులను
నెమరు వేసుకుంటున్నాడు..
80 బండ్లున్న స్టాండులో
ఒంటరిగా
మిగిలిపోయాడు..
భారంగా బండి
నడుపుతున్నాడు..
జట్కావాలా..
మహబూబ్ బాషా..

బ్రిటిష్ పాలన రోజుల్లో ప్రయాణాలు చేసేందుకు ధనికులు, భూస్వాములు జట్కా బండ్లను వాడేవారు. కాలక్రమేణా ఆ జట్కాబండి కనుమరుగైపోయింది. ధర్మవరం పట్టణంలో మాత్రం నేటికీ జట్కాబండి తిరుగుతోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న జట్కా స్టాండు ఒకప్పుడు ఓ వెలుగు వెలిగింది. 1945లో సుమారు 80 జట్కాబండ్లతో పాత బస్టాండు అంజుమన్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసుకున్నారు. నేటికీ జట్కాస్టాండుగా ఎంతో గుర్తింపు ఉంది. జట్కా స్టాండు 80ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. జట్కా బండి నిర్వాహకుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. తమ కుటుంబానికి జట్కాబండి జీవనాధారం అంటున్నారు. తన తాత అలామ్‌సాబ్, ఆ తర్వాత తన తండ్రి సత్తార్ సాహెబ్ జట్కాబండితో కుటుంబాన్ని పోషించేవారని గుర్తు చేసుకున్నారు. తాను కూడా 60 ఏళ్లుగా జట్కాబండితో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని చెబుతున్నారు. అప్పట్లో జట్కాబండ్లకు చాలాగిరాకీ ఉండేదనీ, ఇందులో వెళితే ఎంతో గొప్పగా భావించేవారన్నారు. అప్పట్లో అనాలు, పైసలు తీసుకుని, గమ్యస్థానాలకు చేర్చేవారమని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత రూ.2కే సుమారు 20 కిలోమీటర్ల వరకు తీసుకెళ్లేవారమన్నారు. అప్పట్లో తీరికలేకుండా గిరాకీ ఉండేదనీ, స్టాండులో 80 బండ్ల వరకు పెట్టుకుని జీవనం సాగించేవారమన్నారు. జిల్లాలోనే ధర్మవరంలో అత్యధికంగా జట్కాబండ్లు ఉండేవంటున్నారు. అప్పట్లో రైల్వేస్టేషన్ నుంచి ధర్మవరంలోకి రావాలంటే జట్కాబండిని తప్పనిసరిగా ఎక్కేవారు. కాలక్రమేణా ఆటోలు, రిక్షాలు, ద్విచక్రవాహనాలు రావడంతో జట్కా బండ్లు ఎక్కేవారే కరువయ్యారు. దీంతో సరుకులను పట్టణంలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తూ.. పొట్ట నింపుకుంటున్నానని మహబూబ్ చెబుతున్నారు. పెద్దగా గిరాకీ లేకపోయినా.. తరాల నుంచి చేస్తున్న పని కావడంతో వదులుకోలేకపోతున్నానని ఆయన వివరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం రూరల్





జట్కా బండి నిర్వాహకుడు మహబూబ్ బాషా



పులకుర్తి గ్రామంలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

పల్లె దారి.. పరుగు

పటిష్టంగా సిమెంట్ రోడ్లు

బురద బాధ తప్పుతుందని జనం హర్షం

డి.హీరేహాళ్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అడుగడుగునా గుంతలమయమైన రహదారులకు మహర్దశ కలిగింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లన్నీ గుంతలతో బురదమయంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గత మూడునెలలుగా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పరుగులు పెడుతోంది. నూతన రోడ్ల నిర్మాణంతో గ్రామీణ దారులు కళకళలాడుతున్నాయి. దీంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డి.హీరేహాళ్ మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో 31 పల్లెలు ఉన్నాయి. గత మూడునెలల కాలంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 76 సిమెంట్ రోడ్లకుగాను రూ. 3 కోట్లకుపైగా నిధులతో పనులు చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక గ్రామానికి రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షలు వెచ్చించి నూతన రోడ్లను నిర్మించారు. ఇందులో ముఖ్యంగా వనగుడ్డం గ్రామచరిత్రలో ఒకేసారి రూ. 10 లక్షలకు మించి అభివృద్ధి పనులను చేపట్టలేదు. ఆ గ్రామంలో చాలా ఏళ్లుగా దారులు, మురికి కాలువలుగా మారిపోవడంతో గ్రామస్థులు, నాయకులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే ఆ ఒక్క గ్రామానికే రూ. 25 లక్షలు నూతన రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించారు. వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తి చేశారు. గతంలో మురికిమయంగా మారిన దారులు.. ప్రస్తుతం వీధులన్నీ నూతన రోడ్లతో కళకళలాడుతున్నాయి.



సోమలాపురంలో పూర్తయిన సిమెంట్ రోడ్డు

అడిగిన వెంటనే మంజూరు



డి.హీరేహాళ్ గ్రామంలో చాలా ఏళ్లుగా రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వైసీపీ ప్రభుత్వంలో కూడా అధికారులను రోడ్ల విషయమై విన్నవించుకున్నా పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. దీంతో పనులు పూర్తి రోడ్లను ప్రారంభించారు. నూతన రోడ్లతో వీధులు కళకళలాడుతున్నాయి.

- నాగళ్ల రాజు, డైరెక్టర్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎక్కడ చూసినా బురదమయంగా ఉన్న రోడ్లను ఎన్నికల ప్రచారంలో పరిశీలించాం. గ్రామీణులు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రహించి ఎమ్మెల్యే చొరవ చూపారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలోనూ రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వ్యయంతో నూతన రోడ్లను ఏర్పాటు చేస్తున్నాం. రాబోవు రోజుల్లో మరిన్ని సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

- హనుమంతరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్

డ్రోన్ సేద్యం.. ఉపాధి మార్గం..

- యువకుడి వినూత్న ఆలోచన
- డ్రోన్ సాయంతో పంటలకు మందుల పిచికారీ
- సమయం, డబ్బు ఆదా అంటున్న నాగమునీంద్ర

యల్లనూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో కోర్సు చదివిన యువకుడు వినూత్న ఆలోచన చేశాడు. సేద్యానికి సాంకేతిక సాయం అందించాలనుకున్నాడు. డ్రోన్ సేద్యాన్ని ఎంచుకున్నాడు. రైతులకు సమయం, డబ్బు ఆదా చేయడంతోపాటు తానూ ఉపాధి పొందుతున్నాడు యల్లనూరుకు చెందిన అచ్యుత నాగమునీంద్ర. యువకుడి చిన్నతనంలోనే తండ్రి నారాయణస్వామి మరణించాడు. తల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. నాగమునీంద్ర అగ్రికల్చర్ డిప్లొమో కోర్సు చేశాడు. ఉద్యోగం చేయడం ఇష్టంలేక స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నాడు. అందులో భాగంగా విజయవాడలో డ్రోన్ వినియోగంపై శిక్షణ తీసుకున్నాడు. సాధారణంగా రైతులు వరి, అరటి, మొక్కజొన్న, పప్పుశనగ తదితర పంటలపై క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలంటే ఇబ్బందులు పడేవారు. పంటలపై తొక్కుకుంటూ పిచికారీ చేసేవారు. మరికొన్నిచోట్ల ట్రాక్టర్లతో సైతం పిచికారీ చేసేవారు. ఈ కష్టాలకు చెక్ పెడుతూ.. నాగమునీంద్ర డ్రోన్ సేద్యాన్ని ఎంచుకున్నాడు. సుమారు రూ.6లక్షలతో డ్రోన్‌ను కొనుగోలు చేశాడు. తద్వారా పంటలకు మందులు పిచికారీ చేస్తున్నాడు. ఎకరాలో పిచికారీకి మనుషుల సాయంతో 30 నిముషాల సమయం పట్టేది. డ్రోన్ ద్వారా 5 నిమిషాల్లోనే పూర్తి చేస్తున్నాడు. మందుల పిచికారీకి ఎకరాకు 75నుంచి 90లీటర్ల నీరు అవసరం. డ్రోన్ ద్వారా 10లీటర్ల నీరు చాలని నాగమునీంద్ర చెబుతున్నాడు. పురుగు మందులు కూడా 20శాతం ఆదా కావడంతోపాటు డబ్బు మిగులుతోందని రైతులు చెబుతున్నారు. డ్రోన్ ద్వారా ఎకరాలో పిచికారీకి రూ.500 అద్దె తీసుకుంటున్నాడు. వరిపొలాల్లో మనుషుల ద్వారా పిచికారీ చేయాలంటే రూ.600 నుంచి రూ.800 వరకు ఖర్చవుతుంది. రైతులు నీరు మోస్తూ శ్రమించాల్సి ఉంటుంది. డ్రోన్‌తో అయితే ఆ శ్రమ కూడా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, డ్రోన్ వినియోగంపై పరిసర ప్రాంతాల రైతులకు అవగాహన సైతం కల్పిస్తున్నానని నాగమునీంద్ర చెబుతున్నాడు. ఫలితంగా రైతులే నేరుగా ఫోన్ చేసి, మందులు పిచికారీ చేయాలని కోరుతున్నారట. ఈ విధానంతో డబ్బు ఆదా అవడంతోపాటు శ్రమ కూడా తగ్గుతుండడంతో రైతులు డ్రోన్ ద్వారా పిచికారీపై మక్కువ చూపుతున్నారు.





ద్విచక్రవాహనంలో వెళ్తున్న నాగమునీంద్ర



నాగ మునీంద్ర

పొగాకే మేలు..!

చీడపీడలు తక్కువ


అగ్రిమెంట్ మేరకు ధర

ఆసక్తి చూపుతున్న రైతులు



దండలుగా కూర్చి ఆరబెట్టిన పొగాకు

సాగులో ఉన్న పొగాకు పంట



పెద్దవడుగూరు మండలంలో పత్తి, మిరప తదితర పంటల సాగుతో ఆర్థికంగా నష్టపోయిన రైతులు ఈ సారి పొగాకు పంటను సాగు చేశారు. ఈ పంటకు చీడపీడలు ఆశించకపోవడం, పలు ప్రైవేట్ కంపెనీలే ముందస్తు ధర నిర్ణయించి దిగుబడిని కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గు చూపారు. పెద్దవడుగూరు, లక్షుంపల్లి, చిన్నవడుగూరు గ్రామాల్లో 152 హెక్టార్లలో పంటను సాగుచేశారు. - ఆంధ్రజ్యోతి, పెద్దవడుగూరు



పొగాకు బేళ్లు

పంట సాగు, విక్రయం ఇలా..

పొగాకు పంట సాగు కోసం రైతులు నంద్యాల, బనగానపల్లి, నెల్లూరు ప్రాంతాల నుంచి నారును కొనుగోలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేయాలంటే 10వేల మొక్కలు అవసరమవుతాయి. ఒక్కో మొక్కకు రవాణా ఖర్చుతో కలుపుకొని రూ.2చొప్పున వెచ్చిస్తున్నారు. మరికొందరు బోరుబావి గల రైతులు కిలో విత్తనాలను రూ.600చొప్పున కొనుగోలు చేసి తమ పొలాల్లో నారు వేసుకొని పంట సాగు చేస్తున్నా రు. నారు నాటిన తర్వాత మూడు నెలలకు పొగాకు పక్వానికి వస్తుంది. అప్పుడు కూలీల సాయంతో మొక్క నుంచి ఆకును వేరు చేస్తారు. వాటిని దండలుగా కూర్చి కట్టెలతో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లలో 15రోజుల పాటు ఎండబెడతారు. అనంతరం పొగాకు బేళ్లుగా ఏర్పాటు చేసి క్వింటా రూ.15500 చొప్పున ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు విక్రయిస్తారు. ఎక్కువ మంది బనగానపల్లిలో ఉన్న ఐటీసీ కంపెనీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు ఏడు క్వింటాళ్ల నుంచి 12క్వింటాళ్ల మేర దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కాగా ఎకరానికి దాదాపు రూ.70వేల దాక పెట్టుబడి అవుతుందని వారు పేర్కొన్నారు.



ముందస్తు ఒప్పందంతోనే ఆసక్తి

రెండెకరాల పొలంలో పొగాకు పంటను సాగుచేశా. కొన్ని కంపెనీలు ముందస్తు అగ్రిమెంట్ ధర నిర్ణయించడంతో పంట సాగుపై ఆసక్తి కలిగింది. ప్రస్తుతం ఎకరాకు 8 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. పంట సాగు మొదలు నుంచి ఇప్పటివరకు రెండెకరాలకు కలిపి రూ.1.4లక్షలు పెట్టుబడి పెట్టా. ఇంకా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. వచ్చిన దిగుబడిని బనగానపల్లిలో ఉన్న మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నాం. -రంగనాయకులు, పెద్దవడుగూరు

దిగుబడి బాగా వచ్చింది

ఈ ఏడాది పొగాకు పంట సాగు చేయగా దిగుబడి ఆశించినస్థాయిలో ఉంది. గతంలో సాగుచేసిన పంటల్లో లాభాలు రాకపోవడంతో 5ఎకరాల్లో పొగాకు పంట వేశా. ఈ పంట సాగుకు చీడపీడలు తక్కువైనా కూలీలు అధికంగా కావాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 10క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. పంట మొత్తం మూడు నుంచి నాలుగు కోతలు కోస్తాం. మొదటి, రెండు కోతల్లో కోసిన పంటకు క్వింటా రూ.15500 ఉండగా చివరి కోత మాత్రం నాణ్యతను బట్టి ధరను నిర్ణయిస్తారు. - ఓబుల్‌రెడ్డి, లక్షుంపల్లి

ఔరా.. గిజిగూడు..!



చిటారు కొమ్మకు వేలాడే..
ఇల్లు కట్టుకున్నావు..
ఇంజనీరువు కావు..

లోపలికెళ్లేందుకు
ప్రత్యేక ద్వారం
పెట్టుకున్నావు..
మేస్త్రీవి కావు..

గడ్డి పోచలతో..
నార పాసలతో..
అందమైన బొమ్మరిల్లు
అల్లుకున్నావు..
చెయ్యి తిరిగిన
కళాకారుడివి కావు..

కోట్లు పెట్టి కట్టిన..
భవంతులే కూలుతున్నాయి..
నీ ఇల్లు మాత్రం
చెక్కు చెదరదు..

ఏంటో ఆ నైపుణ్యం..
కాస్తా.. చెప్మా..
గిజిగాడా..



ఈత చెట్టుపై గిజిగాడు ఏర్పాటు చేసుకున్న గూళ్లు

చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపాన ఈత చెట్టులో పెద్ద సంఖ్యలో గిజిగాడు పక్షులు గూళ్లను నిర్మించుకున్నాయి. ఇంజనీర్లను సైతం ఆలోచింపజేసేలా నిర్మాణాలు చేసుకోవడమే విశేషం. ఇతర పక్షులు గంప ఆకారంలో గూళ్లను నిర్మించుకుంటాయి. గిజిగాడు మాత్రం ఒకచోట మాత్రమే ద్వారం ఉండేలా చూసుకుంటుంది. మిగిలిన చోట్లలో కనీసం చీమ కూడా గూడు లోపలికి చొరబడలేని విధంగా మామూలు గడ్డిపోచలతో గూడును ఏర్పాటు చేసుకుంటుంది. అదే గిజిగాడి గొప్పతనం. ప్రకృతి అద్భుతం.

- చిలమత్తూరు, ఆంధ్రజ్యోతి

పేకాటలో దొంగనోటు

ఉప్పందించిన ఆటగాడు

ముఠాను పట్టుకున్న పోలీసులు

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కబోయి.. జైలుపాలు



దొంగనోటు చూపుతున్న డీఎస్పీ



అరెస్టయిన నిందితులు

అనంతపురం క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పేకాటలో ఇద్దరు వ్యక్తులు నకిలీ నోట్లను పెట్టారు. మంగతాయారు (లోపల-బయట) ఆడుతూ.. మోసగించబోయారు. వీరి మోసాన్ని పసిగట్టిన ఒక 'ఆటగాడు' వారికి బుద్ధి చెప్పాలని అనుకున్నాడు. 'సార్.. టీవీ టవర్ దగ్గర గొడవ జరుగుతోంది.' అని పోలీసులకు ఉప్పందించాడు. ఈనెల 28వ తేదీ శివ రాత్రి రోజు వచ్చిన ఈ సమాచారం ఆధారంగా పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి మురళీమోహన్‌రెడ్డి, సాకే రామాంజినేయులు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.24 వేలు స్వాధీనం చేసుకున్నారు. తీరా చూస్తే.. అవి రూ.500 నకిలీ నోట్లు అని తేలింది. లోతుగా విచారిస్తే.. నకిలీ నోట్ల ముఠా గుట్టు బయటపడింది. పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

డీఎస్పీ ఏం చెప్పారంటే....

వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌తో కలిసి అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 'నగరంలో నకిలీ కరెన్సీ చలామణీని కట్టడి చేయాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ సిబ్బందితో కలిసి నిఘా ఉంచారు. ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నౌస్సం మురళీమోహన్‌రెడ్డి, సాకే రామాంజినేయులు, యలమంచి రామాంజినేయులుకు నకిలీ నోట్లను దేవరకొండ రవీంద్ర అనే వ్యక్తి ఇస్తుండగా అరెస్టు చేశారు. రవీంద్ర నుంచి 60 నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. వారి వాంగ్మూలం ఆధారంగా బుడ్డప్పనగర్‌లో సుకుమార్ ఇంటి వద్ద ప్రధాన నిందితుడు దూదేకుల ఖాసీం, బోయ పవన్‌కుమార్, పడిగల సుకుమార్, బొమ్మినేని అశోక్‌చౌదరిని అరెస్టు చేశారు. వారి నుంచి 36 నకిలీలో రూ.500 నోట్లను, ఒక లాప్ టాప్, కలర్ ప్రింటర్, పేపర్ కట్టర్, కలర్ జిరాక్స్ పౌడర్, పేస్ట్, బ్రష్‌లను స్వాధీనం చేసుకున్నారు..' అని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ముఠాలో ప్రధాన నిందితుడు దూదేకుల ఖాసీం, ఇతర నిందితులు బోయ పవన్‌కుమార్, పడిగల సుకుమార్, బొమ్మనేని అశోక్‌చౌదరి, దేవరకొండ రవీంద్ర స్నేహితులు. ఖాసీం గతంలో శ్రీసత్యసాయి బాల వికాస్ స్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. అక్కడ నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తూ అనంతపురం త్రీ టౌన్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. పెద్దవడుగూరు మండలంలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తూ, అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయిన కృష్ణారెడ్డి ఖాసీం ఇంటి సమీపంలో ఉండేవాడు. వీరిద్దరూ కలిసి ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నకిలీ కరెన్సీ తయారు చేయాలని భావించారు. బోయ పవన్‌కుమార్, పడిగల సుకుమార్, బొమ్మినేని అశోక్‌చౌదరి, దేవరకొండ రవీంద్రతో కలిసి పథకం వేశారు. కృష్ణారెడ్డి తనవంతుగా లాప్‌టాప్ ఇచ్చాడు. దేవరకొండ రవీంద్ర రూ.20 వేల డబ్బు ఇచ్చాడు. ఆ డబ్బుతో కమలానగర్‌లో ఒక ప్రింటర్, పేపర్ కట్టర్, కలర్ జిరాక్స్ పౌడర్ పేస్ట్, బ్రష్‌లను కొన్నారు. అశోక్ చౌదరి రూ.10వేలు ఇచ్చాడు. ఆ సొమ్ముతో బెంగుళూరులో పేపర్ కొని, బుడ్డప్పనగర్‌లోని సుకుమార్ ఇంటిలో నకిలీ కరెన్సీని తయారు చేశారు. నకిలీ కరెన్సీని ధర్మవరం పట్టణానికి చెందిన సత్యనారాయణకు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. కృష్ణారెడ్డి, సత్యనారాయణ పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



పరుషకు తరలివచ్చిన జనసందోహం

ఘనంగా గావుల మహోత్సవం

దాదులూరు పరుషకు పోటెత్తిన జనం

కనగానపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరు పరుషకు జనం పోటెత్తారు. పరుషలో భాగంగా మూడో రోజైన మంగళవారం గావుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పోతురాజులు.. నల్లని మేకపిల్లని కొరికి పోతులయ్య స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఈ ఘట్టాన్ని చూసేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం దాదులూరులోనే కాక చుట్టుపక్కల గ్రామాల్లో జంతుబలి ఇచ్చారు. ముందుగా చెన్నకేశవస్వామిని దర్శించుకున్న భక్తులు.. పోతులయ్య, బంగారు లింగమయ్యకు టెంకాయలు కొట్టి, మొక్కలు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దాదులూరు గ్రామం జనసంద్రంగా మారింది.

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు

అనంతపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దని మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు.. ఆ శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక గుత్తి రోడ్డులోని ఏడీ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు, కార్యదర్శులతో మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని 17 మార్కెట్ కమిటీల్లో మూడు, నాలుగు తప్ప.. మిగిలిన వాటిలో వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. అనంతపురం జిల్లా 2024-25 ఆర్థిక సంవత్సరం టార్గెట్ రూ.12.7కోట్లకుగాను 9.97కోట్లు వసూలు చేసిందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లక్ష్యం రూ.5.31కోట్లుకాగా, ఇప్పటికే రూ.4.34కోట్లు రాబట్టిందన్నారు. అన్ని కమిటీలు ఆర్థిక సంవత్సరం చివరికి టార్గెట్లు పూర్తి చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఏడీలు సత్యనారాయణ చౌదరి, మూర్తి, ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.

పీజీ ఫలితాల్లో వైద్య విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

అనంతపురంటౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్యవిద్య పరీక్షల్లో అనంత వైద్య కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. పీజీవైద్య విద్య ఫలితాలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ సోమవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అనంత వైద్య కళాశాల, జిల్లా సర్వజనాస్పత్రిలో చదువుతున్న పీజీ విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మంగళవారం వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ఐదు విభాగాల్లో ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఇందులో గైనకాలజీ విభాగంలో ఈఏడాది కూడా డాక్టర్ సుభోషిత78శాతం మార్కులతో మొదటి ర్యాంకు సాధించగా, డాక్టర్ అమృత77శాతం మార్కులతో మూడో ర్యాంకు సాధించినట్లు తెలిపారు. డెర్మటాలజీ విభాగంలో డాక్టర్ శివాని78శాతం మార్కులతో మొదటి ర్యాంకు, డాక్టర్ నిహారిక 77.7 శాతం మార్కులతో రెండో ర్యాంకు, డాక్టర్ రమ్య 76శాతం మార్కులతో నాలుగో ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. పార్మకాలజీ విభాగంలో డాక్టర్ సాగరిక 76శాతం మార్కులతో రెండో ర్యాంకు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డాక్టర్ హర్షిత76శాతం మార్కులతో రెండో ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. మైక్రోబయాలజీ విభాగంలో డాక్టర్ యల్లం నాయుడు71శాతం మార్కులతో మొదటిర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వీరందరిని ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు మంగళవారం అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రీకరణ పథకం కింద పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ శాఖ, ఏపీ ఆగ్రోస్ సంస్థ ద్వారా 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు సరఫరా చేస్తామన్నారు. జిల్లాకి 1661 యూనిట్లకు రూ.2.86 కోట్లు కేటాయించారన్నారు. వాటిలో 250 బ్యాటరీ, మ్యాన్యువల్‌గా ఉపయోగించే స్ప్రేయర్లు, 600 పవర్ స్ప్రేయర్లు, 7 ట్రాక్టర్‌తో ఉపయోగించే స్ప్రేయర్లు, 740 ట్రాక్టర్‌తో నడిచే యాంత్రీకరణ పనిముట్లు, 28 రొటోవేటర్లు, 18 పవర్ వీడర్లు, 13 కత్తిరింపు యంత్రాలు, 5 పవర్ టిల్లర్లు ఉన్నాయన్నారు. ఐదేళ్లుగా వ్యవసాయ పనిముట్లు తీసుకోని ఎస్సీ ఎస్టీ, మహిళా, చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. పథకం ద్వారా లబ్ధి కోసం తప్పని సరిగా ఈ పంట నమోదు చేసుకుని ఉండాలన్నారు. అటవీ భూములు కలిగిన రైతులు కూడా అర్హులేనన్నారు. కుటుంబంలో ఒక రైతు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక రైతుకు ఒక పనిముట్టు మాత్రమే అందజేస్తామన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రథోత్సవానికి పాదయాత్రగా వెళ్తూ మృత్యు ఒడికి..

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు నేమకల్లు యువకుల దుర్మరణం



గాలి నాగరాజు, గణేష్ (ఫైల్)

బొమ్మనహాళ్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రథోత్సవానికి పాదయాత్రగా వెళ్తున్న ఇద్దరు యువకులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన గణేష్(19), గాలి నాగరాజు (20) బళ్లారి జిల్లా పరిధి మోకా రోడ్డులో సంగనకల్లు గ్రామ సమీపాన సోమవారం రాత్రి బొలెరో ఢీకొనడంతో దుర్మరణం చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్నూరుస్వామి, వంధక్షి దంపతుల కుమారుడు గణేష్ వ్యవసాయం చేస్తుండేవాడు. గాలి తిప్పేస్వా మి, రత్నమ్మ దంపతుల కొడుకు గాలి నాగరాజు బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. వీరిరువురితోపాటు నాగరాజు తమ్ముడు శివ, మరో యువకుడు రామాంజనేయులు స్వగ్రామం నుంచి సోమవారం సాయంత్రం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ పరిధి గూళ్యం గ్రామంలో నిర్వహించే గాదిలింగేశ్వర జోడు రథోత్సవాలకు పాదయాత్రగా బయల్దేరారు. బళ్లారి మీదుగా గూళ్యం వెళ్తున్నారు. మోకా రోడ్డులో సంగనకల్లు గ్రామ సమీపాన సిల్వర్ క్రాస్ వద్ద సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రోడ్డుపక్కన అన్నదమ్ములు శివ, నాగరాజు కలిసి వెళ్తున్నారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బొలెరో నాగరాజును ఢీకొట్టింది. ఆ తరువాత ముందు వెళ్తున్న గణేష్ సైతం ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. కళ్లెదుటే అన్న మరణించడంతో శివ బోరున విలపించాడు. సమాచారం అందుకున్న బళ్లారి రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి, కుటుంబీకులకు అప్పగించారు. మంగళవారం సాయంత్రం మృతదేహాలను నేమకల్లుకు తీసుకొచ్చారు. కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చేతికొచ్చిన కొడుకులు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై బళ్లారి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

బొలెరో వాహనం బోల్తా

బాలిక దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు




సుశీల (ఫైల్)

రాయదుర్గంరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడేగోళం గ్రామ సమీపాన సోమవారం రాత్రి బొలెరో వాహనం బోల్తాపడి సుశీల(15) దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కర్ణాటకలోని సండూరు తాలూకా వడ్డర్లహళ్లి గ్రామానికి చెందిన 35 మంది కళ్యాణదుర్గం సమీపంలోని బెస్తర్లపల్లి భీమలింగేశ్వరస్వామి జాతరకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి బొలెరో వాహనంలో వెళ్తుండగా.. అనంతపురం-రాయదుర్గం రహదారిపై ఉడేగోళం వద్ద బోల్తాపడింది. సుశీల అక్కడికక్కడే మృతిచెందగా.. ఈర మాసప్ప, ఈరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ జయనాయక్ ప్రమాద స్థలానికి చేరుకుని, తన వాహనంలో క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

మంత్రి దృష్టికి భూ అక్రమాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



బాధిత మహిళలతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండాలో ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ చేసిన భూ అక్రమాలను రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. తండాలో మంగళవారం పర్యటించి, భూముల సమస్యలు ఉన్న మహిళలు, రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తండాలోని రైతులకు పాసు పుస్తకాలు ఉన్నా, ఎంపీపీ కుటుంబ సభ్యుల పేరు మీద 1బీ అడంగళ్ లు ఉన్నాయని, వీటిపై బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు. దాదాపు 200ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఈనెల 7న రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌లను అమరావతిలో కలిసి వారి దృష్టికి సమస్య తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఐ నాయకులు కాటమయ్య, జింకా చలపతి, మధు, చల్లా శ్రీనివాసులు, రవి, రమణ, బండల వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఓపీ కౌంటర్లతో తప్పనున్న ఇబ్బందులు

సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు


అనంతపురం టౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో అదనంగా నాలుగు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేశామనీ, తద్వారా రోగులకు ఇబ్బందులు తప్పుతాయని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే ప్రతి పేషెంట్ ఆధార్ కార్డుతోపాటు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉంటే ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. అప్పుడు ఓపీ కౌంటర్ల వద్ద ఎక్కువసేపు క్యూలైన్‌లో ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. పేషెంట్లు సహకరించాలని సూపరింటెండెంట్ కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు సౌజన్యకుమార్ పాల్గొన్నారు.

నేడు వైద్య కళాశాల స్నాతకోత్సవం

జిల్లా వైద్య కళాశాలలో బుధవారం స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు తెలిపారు. 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకున్నారని ఆయన వెల్లడించారు. స్నాతకోత్సవంలో 150 మందికి డాక్టరు పట్టాలు అందజేస్తామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సాయంత్రం జరిగే ఈ వేడుకలకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

అక్రమాలను ఉపేక్షించం

విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్



అనంతపురం న్యూటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలపై ప్రభావం చూపే అక్రమాలను ఉపేక్షించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. విజిలెన్స్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు నెలలుగా డీఎస్పీ నాగభూషణంతో ప్రత్యేక ప్రణాళికతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. అందులో భాగంగానే పాల కల్తీ, పెట్రోల్ బంకుల్లో టాంపరింగ్ గుర్తించామని అన్నారు. పాల కల్తీ అన్ని వర్గాల ప్రజలపై ప్రభావం చూపుతుందని అన్నారు. కల్తీ పాలను తాగినవారు అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పెట్రోల్ బంకుల్లో టాంపరింగ్ కారణంగా వాహనదారులు నష్టపోతారని అన్నారు. కేవలం సోములదొడ్డి వద్ద ఉన్న పెట్రోల్ బంకులోనే రోజుకు 1500 లీటర్ల డీజిల్ దోపిడీ చేశారని, దీన్నిబట్టి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతోందని అన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ టాంపరింగ్ జరిగినట్లు గుర్తించామని, రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని తెలిపారు. లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులకు సూచించామని తెలిపారు.

సార్.. నా కూతుర్ని చంపేశా..!

గుంతకల్లు టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'సార్.. నా కూతుర్ని చంపేశా..' అంటూ పట్టణంలోని తిలక్ నగర్‌కు చెందిన రామాంజనేయులు మంగళవారం సాయంత్రం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో కంగారుపడిన కసాపురం పోలీసులు అతన్ని వెంటబెట్టుకుని, హత్య జరిగినట్లు భావిస్తున్న ప్రాంతానికి వెళ్లి గాలించారు. చీకటి పడటంతో ఆ ప్రాంతంలో ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో అతన్ని తిరిగి స్టేషన్‌కు తీసుకొచ్చారు. తిలక్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు టిఫెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి నలుగురు కూతుళ్లు కాగా, ముగ్గురికి వివాహం జరిపించారు. తన చిన్న కూతురు ఓ యువకుడిని ప్రేమించిందని రామాంజనేయులు పోలీసులకు తెలిపాడు. ప్రేమ వ్యవహారాలు మానుకోవాలని చెప్పినా వినలేదని, దీంతో కసాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు తీసుకెళ్లి హత్య చేశానని తెలిపాడు. కాగా, ఉదయాన్నే తిరిగి గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. రామాంజనేయులు మానసిక పరిస్థితి కూడా ప్రస్తుతం సరిగా కనిపించడం లేదని అన్నారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 270 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.6, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

మార్కెట్‌కు పెరుగుతున్న చీనీ కాయలు

అనంతపురంరూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు చీనీ ఉత్పత్తులు పెరుగుతున్నాయి. కొన్నిరోజుల కిందట మార్కెట్ ప్రారంభమైంది. ఈక్రమంలో రోజురోజుకీ ఉత్పత్తుల రాక పెరుగుతూ పోతోంది. సోమవారం మార్కెట్‌కు 251 టన్నుల చీనీ కాయలు వచ్చాయి. మంగళవారం ఆ సంఖ్య 343 టన్నులకు పెరిగింది. సంబంధిత అధికారులు ఈ నామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. టన్ను గరిష్ఠంగా రూ.24,160, కనిష్ఠంగా రూ.6వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాలు 400 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు మంగళవారం అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 383 క్యూసెక్కులు వెళుతుండగా రిజర్వాయరులో ప్రస్తుతం 1.586 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పది పరీక్షల పరిశీలకుడిగా జేడీ సుబ్బారావు

అనంతపురం విద్య, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పదో తరగతి పరీక్షల పరిశీలకుడిగా సంయుక్త సంచాలకుడు (జేడీ) సుబ్బారావును నియమించారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పదో తరగతి పరీక్షల పరిశీలకుడిగా విద్యాశాఖ కమిషనరేట్‌లో పనిచేస్తున్న జేడీ సుబ్బారావును నియమిస్తూ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు.

'మనమిత్ర' నుంచి టెన్త్ హాల్ టిక్కెట్లు

అనంతపురం విద్య, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన యాజమాన్య హైస్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులు, ప్రైవేట్ విద్యార్థుల పరీక్షల హాల్ టిక్కెట్లను పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 నుంచి లేదా www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థుల హాల్ టిక్కెట్‌లో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మీడియం, ఫొటో సంతకం వంటి వివరాలు తప్పుగా ఉంటే ప్రధానోపాధ్యాయుల ద్వారా dir_govexams@y ahoo.com మెయిల్ చేయాలని సూచించారు.

కంప్యూటర్ ఉచిత శిక్షణ.. ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీయువకులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ, అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 60రోజులపాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ ఎంఎస్ ఆఫీస్, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదవి 20-35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేసి, వంద శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు ఆర్టీసీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నేరుగాగానీ, 7396950345 నంబరులోగానీ సంప్రదించాలని కోరారు.

ఉపాధి నిధులు స్వాహా..!


ప్రజా వేదికలో పాల్గొన్న డ్వామా పీడీ సలీంబాషా, ఇతర అధికారులు

- వైసీపీ ప్రభుత్వం నిర్వాకం
- పనులకు వెళ్లకున్నా, మొక్కలు లేకున్నా బిల్లులు
- రూ.4.77 లక్షలు రికవరీకి ఆదేశం

రాప్తాడు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి నిధులను భారీ మొత్తంలో కాజేశారు. అప్పట్లో వైసీపీ నాయకుల అండదండలతో అధికారులపై ఒత్తిడి తెచ్చి, పనులకు హాజరుకాకపోయినా బిల్లులు స్వాహా చేశారు. పలు అక్రమాలు ప్రజావేదికలో వెల్లడయ్యాయి. మండలంలో ఉపాధి నిధులు స్వాహాచేసిన విషయం ప్రభుత్వం 17వ విడత నిర్వహించిన సామాజిక తనిఖీలో బట్టబయలైంది. 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకూ రూ. 11. 24 కోట్లతో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడి సీలీంబాషా, అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీ చెన్నకేశవులు సమక్షంలో గ్రామాల్లో చేసిన ఉపాధి పనులు, వాటిలో జరిగిన అవకతవకలను సామాజిక తనిఖీ బృందం వివరించారు. ఇందులో గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్‌లు వివిద పనుల్లో చేతి వాటం ప్రదర్శించినట్లు తేలింది. గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లక పోయినా పనులకు హాజరైనట్లు మస్టర్లలో నమోదు చేసి బిల్లులు చేసుకున్నారు. అనంతపురం, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు గ్రామాల్లో నకిలీ జాబ్‌కార్డులు సృష్టించి వారు పనులకు వెళ్లినట్లు బిల్లులు చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల కిందట గ్రామాల నుంచి వలసలు వెళ్లిన వారి పేరిట బిల్లులు నమోదు చేశారు. వలంటీర్ల పేరు మీద కూడా బిల్లులు న మోదు చేశారు. కొన్ని గ్రామాల్లో మామిడి, చీనీ మొక్కలు లేకపోయినా బి ల్లులు చేశారని సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ప్రసన్నాయ పల్లిలో రూ. 5,500, బొమ్మేపర్తిలో రూ. 1.78 లక్షలు, మరూరులో రూ. 24 వేలు, రాప్తాడులో రూ. 68 వేలు, బోగినేపల్లిలో రూ. 1,288, చెర్లోపల్లిలో రూ. 6,754, యర్రగుంటలో రూ. 798, బండమీదపల్లిలో రూ. 13,572, కొత్తపల్లిలో రూ. 1.63 లక్షలు, పాలచెర్లలో రూ. 14 వేలు అవినీతి జరిగినట్లు తెలిపారు. మండలం మొత్తం ఉపాధి పనుల్లో రూ. 4.77 లక్షలు అవినీతి జరిగిందని అధికారులు రికవరీకి ఆదేశించారు. అందరు ఫీల్డ్ అసిస్టెంట్ల రికార్డులు సక్రమంగా నమోదు చేయకపోవడం వలన వారికి రూ. 22 వేలు జరిమానా విధించారు. బొమ్మేపర్తి, కొత్తపల్లిల్లో ఎక్కువగా అవినీతి జరిగిందని అధికారుల తనిఖీలో తేలింది. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఉపాధి పనుల్లో మరింత ఎక్కువగా అవినీతి జరగగా...ఆ అవినీతి బయటపడకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లు మేనేజ్ చేశారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్ల గైర్హాజరు

సామాజితక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభకు ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా హాజరుకావాలి. వారు చేయించిన పనులకు ఉన్నతాధికారుల వద్ద సమాధానం చెప్పాలి. అయితే ప్రజావేదికకు మండలంలోని 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరకావాల్సి ఉండగా, నలుగురు మాత్రమే వచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓలు సావిత్రి, ఓబన్న, ఈసీ మురళి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విధుల్లోకి రూరల్ తహసీల్దార్

అనంతపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్ విధుల్లోకి చేరనున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆయన గత నెల 17వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ వరకు సెలవులో వెళ్లారు. పదిహేను రోజుల పాటు ఆయన సెలవులో వెళ్లారు. తిరిగి ఆయన బుధవారం విధుల్లోకి చేరనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

గురుకుల ప్రవేశాలకు ప్రతిభ పరీక్ష : ప్రిన్సిపాల్

గార్లదిన్నె, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికి ప్రతిభ పరీక్ష తప్పనిసరి అని ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజినేయులు నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారన్నారు. అయితే ఈ ఏడాది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్ పరీక్షలు పెడుతున్నట్లు తెలిపారు. కావున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రతిభ పరీక్షకు సిద్ధం కావాలని తెలిపారు.

పాఠశాలకు ఆర్థికసాయం

అనంతపురం కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతి విద్యామందిరంలో అదనపు గదుల నిర్మాణం కోసం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ప్రస్తుతం విద్యామందిరంలో ఏడో తరగతి వరకే విద్యాబోధన చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి 10వ తరగతి వరకు బోధన చేసేందుకు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ మంగళవారం విద్యామందిరం ప్రిన్సిపాల్ వసుంధరమ్మను కలిసి రూ.10,116 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకౌంటెంట్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ మహిళా సదస్సుకు నార్పల ఈఓఆర్డీ


సదస్సుకు హాజరైన ఈఓఆర్డీ శైలజారాణి

నార్పల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేంద్రపంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలో మహిళా సాధికారతపై నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు నార్పల ఈఓఆర్డీ శైలజారాణికి ఆహ్వానం వచ్చింది. దీంతో ఆమె సదస్సులో పా ల్గొన్నారు. మహిళల నేతృత్వంలో స్థానిక సంస్థల బలోపేతం, పాలనా సామర్థ్యాల పెంపుపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

పీవీకేకే ఐటీలో ఇంగ్లిష్ నైపుణ్య పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంగ్లీష్ అసెస్‌మెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసా గ్లోబల్ అండ్ అబ్రాడ్ ఫోకస్ సంస్థల డైరెక్టర్లు రాజ్‌కుమార్, అపర్ణ, కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్, ఫిలిప్స్ హాజరయ్యారు. కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ వహీదా పర్వీన్ మాట్లాడుతూ..పరీక్షకు 730 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

ఇంజనీరింగ్‌తోనే ప్రపంచ నవీకరణ

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌తోనే ప్రపంచ నవీకరణ చెందుతోందని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ ఇంజనీర్స్ డే సందర్భంగా కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ అనంతపురం కేంద్రం, పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధీం ద్రరావు, ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి హాజరై హాజరయ్యారు. కార్యాక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో విభాగాధిపతులు సురేష్‌బాబు, డీఈ నారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కేయూ విద్యార్థికి రిమాండ్

అనంతపురం క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్కేయూలో ఓ విద్యార్థిని వేధింపులకు గురి చేసిన కేసులో అదే యూనివర్శిటీ విద్యార్థి విష్ణువర్ధన్‌ను ఇటుకలపల్లి పోలీసులు రిమాండ్‌కు పంపారు. గార్లదిన్నె మండలం ఓబుళాపురానికి చెందిన విష్ణువర్ధన్ ఎస్కేయూలో పీజీ సెకండియర్(లైబ్రరీ సైన్స్)చదువుతున్నాడు. ఓ విద్యార్థినితో చనువుగా ఉన్న ఫొటోలను సోషల్‌మీడియాలో పెడుతానంటూ బ్లాక్‌మెయిల్ చేసిన ఘటనపై విష్ణువర్ధన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

కారు ధ్వంసంపై కేసు

అనంతపురం క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని కృపానందనగర్‌లో కారు ధ్వంసం చేసిన ఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానికంగా నివాసముంటున్న ఓ మహిళా రెవెన్యూ అధికారి కుమారుడు భరత్. వీరికి మరో కుటుంబంతో ఉన్న సంబంధాల నేపథ్యంలో భరత్‌కు, శివ అనే వ్యక్తితో వివాదం నెలకొంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి భరత్ కారు అద్దాలు కొందరు ధ్వంసం చేశారు. ఈఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు శివ, రాజశేఖర్, హరి, సందీప్, పవన్‌కుమార్‌పై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా... వ్యక్తి మృతి


వీర నారాయణ(ఫైల్)

శింగనమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమడి- తరిమెల రోడ్లో ఆటో బోల్తా పడడంతో బుడేపల్లి వీరానారాయణ (54) అనే వ్యక్తి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మండలంలోని ఆనందరావుపేటకు చెందిన బుడేపల్లి వీరానారాయణ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆదే గ్రామానికి చెందిన సంజప్ప అయన కూమారుడు లడ్డు మంగళవారం ఉదయం ఐస్‌క్రీమ్ తీసుకొచ్చేందుకు వీరానారాయణ ఆటోలో పామిడికి వెళ్లారు. ఐస్‌క్రీమ్‌లు తీసుకుని ఆనందరావుపేటకు తిరిగి వస్తుండగా కల్లుమడి- తరిమెల రోడ్డు మధ్యలో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ వీరానారాయణ ఆటో కింద పడి అక్కడికక్కడే మృతిచెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న సంజప్పకు కుడిచేయి విరిపోయింది. లడ్డు స్వప్ప గాయలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య , కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శింగనమల ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి


ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, అధికారులు

అనంతపురం విద్య, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా యాజమాన్యం కింద పనిచేసే ముగ్గురికి ఏవోలుగా ఉద్యోగోన్నతి ఇచ్చారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అధికారులు మంగళ వారం ఉత్తర్వులిచ్చారు. సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, ఫణిశేఖర్‌రెడ్డికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు వారికి జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా ఉద్యోగోన్నతి ఉత్తర్వుల కాపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్‌ఎంఈ వరం'

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎస్‌ఎంఈ పథకం గొప్ప వరమని యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక శారదానగర్‌లోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ ఔత్సాహిక వేత్తల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడారు అనంతరం ఎంఎస్‌ఎంఈ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. ఆ బ్యాంకు ఆర్‌ఎం జితేంద్రకుమార్, చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శేషాంజినేయులు, మేనేజర్లు, ఎంఎస్‌ఎంఈ ఔత్సాహిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మరో 20 రోజులు సాగునీరు ఇవ్వండి

- ఆర్థిక మంత్రి కేశవ్‌ను కోరిన ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాలువ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను టీడీపీ శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవ రెడ్డి కోరారు. టీడీపీ జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి శ్రీధర్‌చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి మంగళవారం ఎంపీ పార్థసారథితో పాటు విజయవాడలోని మంత్రి కేశవ్‌ను కలిశారు. శింగనమల నియోజకర్గంలోని దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలో వేల మంది రైతుల వరి పంట ప్రస్తుతం కోత దశలో ఉందని ముంటిమడుగు కేశవరెడ్డి వివరించారు. మరో 20 రోజులు సాగునీరు విడుదల చేస్తే రైతులు పంట నూర్పిడి చేసుకుంటారని తెలిపారు. ఇందుకు మంత్రి కేశవ్ సానుకూలంగా స్పందించి దక్షిణ కాలువ ఆయకట్టుకు మరో 20 రోజులు సాగునీరు విడుదల చేయాలని సంబంధింత అధికారులను ఆదేశించినట్లు కేశవరెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కృపానంద నగర్‌లో తన బంధువుల ఇంట్లో ఉంటున్న ఓ యువతి అదృశ్యంపై టూటౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఆ యువతి నగరంలో పీజీ చదువుతోంది. కమలానగర్‌లోని హాస్టల్ ఉండి చదువుతుండగా...గత కొంతకాలంగా కృపానందనగర్‌లోని బంధువుల ఇంట్లో ఉంటోంది. సోమవారం ఆ ఇంటి నుంచి అదృశ్యమైంది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐషర్ ఢీకొని ఐటీఐ విద్యార్థికి తీవ్రగాయాలు

శింగనమల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఐషర్ ఢీకొని ఐటీఐ విద్యార్థి తీవ్ర గాయాల పాలయ్యాడు. పెద్దవడగూరు మండలం మిడుతూరుకు చెందిన రమాదేవి కుమారుడు సునీల్ మంగళవారం బైక్‌లో అనంతపురం వస్తున్నాడు. గార్లదిన్నె సమీపంలో బైపాస్ వద్ద ఐషర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. తీవ్రగాయాలైన సునీల్‌ను 108 వాహనంలో అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని 24 గంటలు గడిస్తేగాని చెప్పలేమని డాక్టర్లు తెలిపినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ద్విచక్ర వాహనం డివైడర్‌కు ఢీకొని మరో ఇద్దరికి...

శింగనమల మండలంలోని శివపురం వద్ద ద్విక్ర వాహనం డివైడర్‌కు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోతురాజుకాల్వ గ్రామానికి చెందిన బోయ బాలముని, చౌడయ్య మంగళవారం రాత్రి పని నిమిత్తం అనంతపురం వెళ్లి తిరిగి వస్తున్నారు. శివపురం వద్ద ద్విచక్ర వాహనం డివైడర్‌కు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చౌడయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి చెంప పెట్టు

- ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి చెంపపెట్టులాంటివని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిది నెలలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు విద్యావంతులు సానుకూలంగా ఉన్నారన్నారు. ఇందుకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మద్దతు ఇచ్చిన అభ్యర్థులు దేశంలోనే రికార్డు స్థాయి మెజార్టీతో గెలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని కొన్ని రోజులుగా వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, తాజా ఎమ్మెల్సీ ఫలితాలు వారికి చెంపపెట్టుగా మారాయని ఆయన పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి నేతన్నల క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న పోతుల లక్ష్మీనరసింహులు తదితరులు

అనంతపురం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేతన్నల సంక్షేమం సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక క్లాక్ టవర్ సమీపంలోని జౌళి శాఖ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ... గత వైసీపీ సర్కార్‌లో జగన్ మోహన్‌రెడ్డి చేనేతల నోట్లో మన్ను కొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో చేనేతల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, నాగరాజు, రామకృష్ణ, ప్రభాకర్, రామాంజి, రాజ, అంజి, పురుషోత్తం, మహేష్, రాజశేఖర్, నరసింహులు, సత్యనారాయణ, తిమ్మప్ప, మంజునాథ్, గోపాల కృష్ణ, ప్రతాప్ పాల్గొన్నారు.

మహాజన సభను విజయవంతం చేయండి

అనంతపురం టౌన్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్న మహాజన సభను విజయవంతం చేయాలని అనంతపురం డివిజన్ పోస్టల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పీఎస్ కేఆర్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఈ మహాజనసభను ఏర్పాటుచేసామన వారు తెలిపారు.

ఘనంగా ఆలం జన్మదిన వేడుకలు

- వెంకట్ వకుళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


నార్పలలో రక్తదానం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

నార్పల, మార్చి4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణ దానమని టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసా నాయుడు పేర్కొరు. ఆయన మంగళవారం కార్యకర్తల సమక్షంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అలాగే మండల కేంద్రంలోని ఆలం కాంప్లెక్స్‌లోని టీడీపీ కార్యాలయం ఆవరణంలో వెంకట్ వకుళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 417 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలం మాట్లాడుతూ... పుట్టిన రోజు సందర్భంగా ప లు సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం కోసం మా వంతు బ్లడ్ డోనేషన్ క్యాంపు ఏర్పాటు చేయడం, దానికి మంచి స్పందన లభించడం అభినందనీయమన్నారు. నిరంతరం రక్తదాన శిబిరాలు కొనసాగి స్తామని తెలిపారు. రక్తదాతలను అభినందించి, సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను ఆలం వెంకటనరసానాయుడు చేతుల మీదుగా అందజేశారు.

ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించాల్సిందే

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికి ఉచితంగా వైద్యం అందించాల్సిందేనని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్టీఆర్ వైద్య సేవపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం పేదలకు ఉచితంగా వైద్యం అందిం చేందుకు ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అలాంటి పథకాన్ని సామాజిక స్పృహతో చూడాల్సిందిపోయి కొందరు ఆదాయ వనరులుగా ఆలోచించి అక్రమాల కు పాల్పడటం అన్యాయమన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా డబ్బులు వసూలు చేస్తున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్, రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, వివిధ ఆస్పత్రుల యజమానులు పాల్గొన్నారు.

క్లబ్‌పై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- అనంతపూర్ క్లబ్ మేనేజర్ అరెస్ట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనంతపూర్ క్లబ్‌పై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురి తమైన క్లబ్‌లో బార్ అనే కథనానికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి నేతృత్వంలో ఏఈఎస్ శ్రీరామ్, ఇన్‌స్పెక్టర్లు అన్నపూర్ణ, సునంద, ఎస్సైలు నరేష్, హరికృష్ణ మంగళవారం అనంతపూర్ క్లబ్‌పై ఆకస్మిక దాడులు చేశారు. క్లబ్‌లో బార్ అండ్ రెస్టారెంట్ అని అనధికారికంగా అలా బోర్డు పెట్టి మద్యం తాగిస్తున్నట్లు గుర్తించారు. అంతేగాక అక్కడి మద్యం షాపులో నుంచి అటాచ్‌రూం ఏర్పాటు, లోపలికి మద్యం తీసుకెళ్లి సేవిస్తున్నట్లు గుర్తించామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి తెలిపారు. దీంతో క్లబ్ మేనేజర్ వెన్నపూస చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఆయనను అరెస్ట్ చేసి, విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఎరువుల రేకు పాయింట్ తనిఖీ

అనంతపురం అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఎరువుల రేకు పాయింట్‌ను జేసీ శివనారాయణ్‌శర్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేకు పాయింట్ ద్వారా రిటైల్ ఎరువుల దుకాణాలకు, రైతు సేవా కేంద్రాలకు ఏ రకంగా ఎరువులు పంపుతున్నారన్న విషయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ పలు సూచనలు చేశారు. అనంతరం అవేజ్ ఫర్టిలైజర్స్ గోదాములను పరిశీలించారు. అక్కడ వివిధ డీలర్లకు సంబంధించి వివరాలపై ఆరా తీశారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ రవి, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ఏఓలు పాల్గొన్నారు.

అక్రమ సొమ్మును చెల్లించాల్సిందే : సీఎఫ్

అనంతపురం న్యూటౌన్, మార్చి4 (ఆంధ్రజ్యోతి) అనంతపురం రేంజ్ కార్యాలయంలో ఓ కాంట్రాక్ట్ వర్కర్ అక్రమంగా స్వాహా చేసిన సొమ్మును తిరిగి చెల్లంచాని సీఎఫ్ యశోదిబాయి పేర్కొన్నారు. మంగళవారం అటవీశాఖ సర్కిల్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో వివరాలను ఆమె వెల్లడించారు. చలానాల రూపంలో ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిన సొమ్మును ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి నకిలీ చలానాలతో పక్కదారి పట్టించాడన్నారు. దీనిపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, ఆ సొమ్ము రికవరీపై డీఎఫ్‌ఓకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

మా సమస్యలపై స్పందించిన రవాణా మంత్రి

- ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసే విషయాన్ని కేబినెట్‌లో ప్రస్తా వి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సం ఘం నాయకులు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తదితరులు మంగళవారం విజయవాడ సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో కలిసి సమస్యలను మంత్రికి వి వరించినట్లు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నా రు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్లకు తన లెటర్ ప్యాడ్‌తో మెయిల్ ద్వారా లేఖలు పంపినట్లు తెలిపారు. సంఘం నాయకులు రవీంద్ర, వికాస్‌కుమార్ రెడ్డి, నాగజ్యోతి, నాగరాజు మంత్రి కలిసిన వారిలో ఉన్నారన్నారు.

చిరువ్యాపారులను కాపాడాలి : సీఐటీయూ

అనంతపురం కల్చరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దాదాపు 20 సంవత్సరాలుగా నగరంలో తోపుడుబండ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటున్నవారిని కాపాడాలని సీఐటీయూ నగర కార్యదర్శి ముత్తుజ డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రి ఎదుట ఉన్న తోపుడుబండ్ల వ్యాపారులు, ఆటో కార్మికులు, అంబులెన్స్ కార్మికులను అక్కడి నుంచి ఖాళీ చేయాలని నగరపాలక సంస్థ అధికారులు ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు మంగళవారం ప్రభుత్వాస్పత్రి ఎదుట చిరువ్యాపారులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ముత్తుజ మాట్లాడుతూ... ఆస్పత్రికి వచ్చే వేలాదిమందికి చిరు వ్యాపారులు తక్కువ ధరలకే తినుబండారాలను అందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆస్పత్రి వద్ద నుంచి చిరువ్యాపారులను పంపేయకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకుడు శివారెడ్డి, అంబులెన్స్ యూనియన్ నాయకులు జిలాన్, జయ, గోపాల్, అనీల్, సలీం, తోపుడుబండ్ల వ్యాపారుల యూనియన్ నాయకులు వెంకటరత్నం, రామాంజి, రవి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరో ఇద్దరు డాక్టర్లకు మెమోలు

అనంతపురం టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాసర్వజన ఆస్పత్రిలో డ్యూటీ సమయంలో విధుల్లో లేనందుకు మరోఇద్దరు డాక్టర్లకు మెమోలు ఇచ్చారు. మంగళవారం ఎస్‌ఎన్‌సీయూ (శిశు సంరక్షణ కేంద్రం)ను సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తనిఖీ చేసారు. ఆ సమయంలో డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ హరిణి కనిపించకపోవడతో ఆమెకు మెమోజారీచేవారు. అలాగే ఆ విభాగాధిపతి డాక్టర్ శంకరనారాయణ పర్యవేక్షణలో నిర్లక్ష్యం చేసినందుకు ఆయనకు మెమో జారీచేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

ఇళ్ల పేరుతో రూ. కోట్లు వృథా..!

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్లు, అంతకు ముందు టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల పేరుతో కోట్ల రూపాయల ప్రజా సంపద వృథా అయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ విమర్శించారు. ఆయన మంగళవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, రాప్తాడు కార్యదర్శి పోతు లయ్య, స్థానిక నాయకుడు నాగార్జునతో కలసి మండలంలోని ఆలమూరు, కొడిమి లేఅవుట్లను పరిశీలించారు. అర్బన్ పరిధిలో కొడిమి వద్ద ఒక్క జగనన్న ఇల్లు పూర్తి కాలేదని, ఆలమూరు పదిశాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదన్నారు. అక్కడ నివాసం ఉన్న వంద కుటుంబాలకు సరైన సౌకర్యాలు లేవన్నారు. ప్రభుత్వం మారగానే నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. ఆయా లేఅవుట్లలో రూ. లక్షలు విలువ చేసే ఐరన్ తుప్పు పట్టి పోతోందని, ఇసుక, కంకరను యథేచ్ఛగా దొంగలిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జేఎన్‌టీయూ సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిపివేశారన్నారు. పూర్తి కాని ఇంటికి అప్పు చెల్లించమని బ్యాంకు వారు నోటీసులు ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

ఇళ్ల స్థలాల హామీని ప్రభుత్వం నెరవేర్చాలి

- సీపీఐ నాయకుల డిమాండ్ ● ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా


నిరసనకు ర్యాలీగా వస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఎన్నికల ముందు ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ రాప్తాడు నియోజకవర్గం ఆధ్వర్యంలో అనంతపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద వందలాదిమంది మహిళలు, నాయకులు ధర్నాచేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ....నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు అందజేయాలన్నారు. జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. ప్రతి కేబినెట్ మీటింగ్‌లో పక్కా ఇళ్ల నిర్మాణం చేపడతామన్న మాటలు మినహా ముందుకు సాగడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో 33 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, ఇళ్ల నిర్మాణాలకు రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చారన్నారు. అది ఏమాత్రం సరిపోదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ....సోములదొడ్డి, ఇంద్రజిత్‌నగర్, రాచానపల్లి ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని 15 ఏళ్లుగా నివాసం ఉంటున్నవాళ్లకు ఇళ్లపట్టాలు ఇవ్వాల న్నారు. అలాగే ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేశవరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు కృష్ణుడు, వన్నూరెడ్డి, రమేష్, నరేష్, చలపతి, ధనుంజయ, రాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి

గుత్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవా సమితి చైర్మన్, ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీహరి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్వేత పేర్కొన్నారు. స్థానిక జిల్లా న్యాయాధికారి కోర్టు హాలులో మంగళవారం జాతీయ లోక్‌ఆదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీపీ సురేఖ, గుత్తి, పామిడి, పెద్దవడుగూరు సీఐ, ఎస్ఐలు, న్యాయవాదులు గంగాధర్‌కుమార్, శ్రీనివాసులు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి పథకాలను పరిశీలించిన ఈఈ

గుత్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు గుత్తి, గుత్తిఆర్ఎస్‌లోని మంచి నీటి పథకాలను మున్సిపల్ కమిషనర్ జబ్బర్ కలసి మంగళవారం పరిశీలించారు. వార్డుల్లో నీటి సరఫరా సౌకర్యాలను ఆరాతీశారు. కార్యక్రమంలో డీఈఈ హేమచంద్ర, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గుత్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి సురేష్(25) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగప్ప తెలిపారు. గుంతకల్లు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన సురేష్ కర్ణాటక రాష్ట్రం రాయచూరులోని ఓ ఫార్మసీ కంపెనీలో పనిచేస్తుండేవాడన్నారు. గ్రామానికి వస్తూ సోమవారం రాత్రి రైల్వేస్టేషన్ సమీపంలో ఉప్పు వంక వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆత్మహత్యకుపాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకుని వివాహిత..

పామిడి: మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన వైశాలి(27) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఈశ్వరయ్య భార్య వైశాలి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందన్నారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆమెకు కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విత్తన కంపెనీలతో అగ్రిమెంట్ చేయించాలి

విడపనకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్‌లోనైనా గడ్డి జొన్న విత్తనాలు ఇచ్చే కంపెనీలతో అగ్రిమెంట్లు చేయించాలని రైతులు ఉరవకొండ ఏడీఏ పద్మజను కోరారు. మండలంలోని హావళిగి గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేసే గడ్డి విత్తన జొన్న పంటలను సాగు చేసి లక్షల్లో నష్టాల పాలవుతున్నామని తెలిపారు. గడ్డి విత్తనాలు ఇచ్చే కంపెనీల ప్రతినిధులు ఎలాంటి అగ్రిమెంట్లు లేకుండా విత్తనాలు ఇచ్చి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడీఏ పద్మజ మాట్లాడుతూ.. జిల్లా అధికారులతో చర్చించి చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ధ్యానంతో విద్యపై ఏకాగ్రత

బెళుగుప్ప, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో విద్యపై ఏకాగ్రత, మానసిక విశ్రాంతత చేకూరుతాయని అంతర్జాతీయ యోగా గురువులు న్యూజిలాండ్‌కు చెందిన మైకేల్, డెన్మార్క్‌కు చెందిన డొమేనిక పేర్లే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్‌లో మంగళవారం ట్రాన్సిడెంటల్ మెడిటేషన్ గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమలో కరెస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

గుమ్మఘట్ట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామ శివారులో పురాతన ఆలయాల సమీపంలో గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో గుప్తనిధులు ఉన్నాయన్న సమాచారంతో దుండగులు కాపు కాసి గుప్తనిధుల కోసం రాత్రి వేళల్లో తవ్వకాలు చేపట్టారు. మంగళవారం ఉదయం సమీప పొలాల రైతులు గుర్తించి గుమ్మఘట్ట పోలీసులకు సమాచారం అందించారు. గుమ్మఘట్ట ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో వెళ్లి గుప్తనిధుల తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైరు చోరీ

రాయదుర్గంరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడేగోళం గ్రామం మద్దానేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఉన్న పొలాల్లో సోమవారం రాత్రి విద్యుత్ మోటార్లకు అమర్చిన కేబుల్‌వైరును చోరీ చేసినట్లు రైతులు రాజు, జలంధర్, మంజునాథ, వెంకటప్ప, వన్నూరుస్వామి, రామ్మూర్తి మంగళవారం తెలిపారు. తమ వ్యవసాయ పొలాలలో విద్యుత్ మోటార్లకు ఏర్పాటు చేసుకున్న కేబుల్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు 300 మీటర్లు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం

ఉరవకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ ఎక్సైజ్, అర్బన్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లు, టెట్రా ప్యాకెట్లు, నాటు సారాను మంగళవారం ధ్వంసం చేశారు. పట్టణ శివారులోని చాబాల రోడ్డులో ఎక్సైజ్ ఏఈఎస్ రేవతి ఆధ్వర్యంలో పట్టుబడిన మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించారు. 325 మద్యం బాటిళ్లు, 1105 టెట్రాపాకెట్లు, 52 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామని సీఐ రవిచంద్ర తెలిపారు. ఎక్సైజ్ ఏఈఎస్ రేవతి, కర్ణాటక సరిహద్దులోని విడపనకల్లు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో ఉరవకొండ సీఐ మహానంది, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ ఏఈఎస్, పోలీసులు

నష్టాలు మిగిల్చిన రబీ

● దిగుబడి తగ్గిన పప్పుశనగ, మొక్కజొన్న
● ధరల పతనంతో రైతుల్లో ఆందోళన



తాతగారిపల్లి వద్ద ఆరబెట్టిన మొక్కజొన్న పంట, కొండేపల్లి వద్దరాసిగా పోసిన పప్పుశనగ

తాడిపత్రి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసిన రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. మొక్కజొన్న, పప్పు శనగ సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. తుఫాన్ కారణంగా పంట దెబ్బతిని అనుకున్న దిగుబడి రాలేకపోయింది. తాడిపత్రి నియోజకవర్గంలో పప్పుశనగ 40,455 ఎకరాలు, మొక్కజొన్న 2,276 ఎకరాల్లో సాగు చేశారు. పంట దిగుబడి ఆశాజనకంగా లేదు. పప్పుశనగ మంచి అదునులో విత్తనం వేశామని రైతుల్లో ఆనందం ఉన్న సమయంలో ఒక్కసారిగా తుఫాన్ రావడంతో పంట చేతికి రాకుండా పోయింది. బాగా పండిందంటే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది తుఫాన్ కారణంగా 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రావడంతో రైతులు చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. ఏడాదికి ఒక్కపంట మాత్రమే పప్పుశనగ సాగుచేస్తారు. ఈ పంట కూడా అనుకున్న రీతిలో రాకపోవడంతో సంవత్సరం పొడవునా కుటుంబాన్ని ఎలా పోషించాలి, తెచ్చిన అప్పులు, పిల్లల చదువులు ఎలాగని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.10వేల నుంచి 12వేల వరకు ఖర్చు అవుతుంది. కొందరు ఉన్న పొలానికి తోడు మరింత పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేశారు. కనీసం కౌలు డబ్బులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనానికి క్వింటా రూ.7,500 నుంచి 8వేల వరకు కొనుగోలు చేసి తెచ్చామని, ప్రస్తుతం ఆ ధర పలుకుతుందన్న ఆశ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పప్పుశనగ రూ.5,600, మొక్కజొన్న రూ.2,200 వరకు ధర ఉంది. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో మొక్కజొన్న రూ.2,800 నుంచి 3,200 వరకు ధర ఉండేది. పప్పుశనగ రూ.7,500 నుంచి 8వేల వరకు ఉండేదన్నారు. శనగ విత్తనం నల్లబడడంతో వ్యాపారులు ఆసక్తి చూపకపోగా తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. వేస్టేజీ క్వింటాకు 10 నుంచి 18 కిలోల వరకు తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

తుఫాన్‌తో దిగుబడి తగ్గింది



నాకున్న ఐదెకరాలతోపాటు మరికొంత పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నా. ఈ సంవత్సరం తుఫాన్ కారణంగా దిగుబడి ఆశించినంత రాకపోవడం ఆందోళనగా ఉంది. వర్షంపైనే ఆధారపడి సాగుచేస్తున్నాం. ఏడాదికి ఒక్కపంటే. ఈ పంటపైన కుటుంబమంతా ఆధారపడాల్సి వస్తోంది. పంట దిగుబడి, ధర రెండూ లేకపోవడంతో భారీగా నష్టపోతున్నాం.

-గోపాల్‌నాయుడు, పప్పుశనగ రైతు, కొండేపల్లి

ఆశించినంత ధర లేదు



నాకున్న 12ఎకరాల్లో 8 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. ఈ సంవత్సరం వర్షాలు సరిగా లేక పోవడం, దిగుబడి కూడా అంతంతమాత్రంగానే రావడంతో ధర పలుకుతుందనే ఆశ ఉండేది. కానీ నిరాశే మిగిలింది. క్వింటా రూ.2,100 నుంచి రూ.2,250 వరకు ధర ఉంది. ప్రస్తుతం కూలీల రేట్లు, మిషన్ ఖర్చులతో భారమయింది.

-పురుషోత్తంనాయుడు, మొక్కజొన్న రైతు, తాతగారిపల్లి

ఘనంగా సుంకులా పార్వతీదేవి రథోత్సవం



సుంకులా పార్వతీదేవి రథాన్ని లాగుతున్న భక్తులు

విడపనకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో సుంకులా పార్వతీ దేవి రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం హోమం అనంతరం బలి హారణ నిర్వహించారు. సాయంత్రం సుంకులా పార్వతీదేవి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తీసుకు వచ్చి రథంలో కొలువు దీర్చారు. అనంతరం వివిధ గ్రామాల భక్తులు అమ్మవారి నామస్మరణతో రథాన్ని లాగారు. తిరిగి రథం సుంకులమ్మ దేవాలయం చేరుకోవటంతో రథోత్సవ వేడుకలు ముగిశాయి. పాల్తూరు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి

శెట్టూరు/కుందుర్పి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అయ్యగార్లపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ నాగిశెట్టి గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ధర్మతేజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు అబ్దుల్‌రజాక్ గుండె సంబంధిత వ్యాధికి చికిత్స తీసుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించారు. కుందుర్పిలోని టీడీపీ కార్యకర్త వెంకటేశులు తల్లి ఆదిలక్ష్మమ్మ, బంగారు నారాయణప్ప కోడలు రేఖమ్మ ఇటీవల మృతి చెందారు. ధర్మతేజ వారి కుటుంబాలను పరామర్శించారు.

విద్యార్థుల పట్ల కఠిన వైఖరి తగదు

యల్లనూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు కఠిన వైఖరి అవలంభించరాదని రూరల్ సీఐ సత్తిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థులను భయపెట్టే ధోరణి అవలంభిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఎంఈఓ చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాడిపత్రి, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్న పెద్దిరాజు కుటుంబానికి రూ.12వేలు ఆర్థికసాయాన్ని అందించినట్లు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు గురప్ప తెలిపారు. లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పెద్దిరాజు కుటుంబపోషణ కోసం ఇబ్బందులు పడుతున్నాడని సంస్థ దృష్టికి రావడంతో దాతల సహకారంతో ఆర్థికసాయం అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

తాడిపత్రి, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామంలో గత నెల 15న పుష్పావతి ఇంట్లో దొంగతనం చేసిన కేసులో రాజు అనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. రెండురోజులక్రితం గంగాదేవిపల్లిలో ఒక ఇంటిలో దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో గ్రామస్థులు దొంగను పట్టుకొని రూరల్ పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీసులు దొంగను విచారించగా.. యాడికి మండలకేంద్రానికి చెందిన రాజు గతంలో చాలాచోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిందితుడిని కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

బెదిరింపుపై కేసు నమోదు

తాడిపత్రి మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన రాముపై అదే గ్రామానికి చెందిన రాజగోపాల్‌రెడ్డి అనే వ్యక్తిని అంతు చూస్తా అంటూ బెదిరించాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. రాము టీదుకాణం నిర్వహిస్తున్నాడని, ఆ స్థలం తనదే అంటూ రాజగోపాల్‌రెడ్డి అతన్ని బెదిరించాడని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్రగాయాలు

శింగనమల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వ్యాన్ ఢీకొని ఐటీఐ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దవడగూరు మండలం మిడుతూరుకు చెందిన రమాదేవి కుమారుడు సునీల్ మంగళవారం బైక్‌లో అనంతపురం వస్తున్నాడు. గార్లదిన్నె సమీపంలో బైపాస్ వద్ద వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. తీవ్ర గాయాలైన సునీల్‌ను 108 వాహనంలో అనంతపురంలోని ప్రభుత్వ సర్వజ నాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని 24 గంటలు గడిస్తేగాని చెప్పలేమని డాక్టర్లు తెలిపినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రతి రైతూ గుర్తింపు నంబరు పొందాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

యాడికి/పెద్దపప్పూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు నంబర్ కలిగి ఉండాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం యాడికి మండలంలోని వేములపాడు గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులంతా తప్పకుండా ప్రత్యేక గుర్తింపు నెంబర్‌ను పొందాలని తెలిపారు. ఈ గుర్తింపు సంఖ్య లేకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమపథకాల లబ్ధి చేకూరదని వివరించారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్‌బాషా, ఏఈఓ జహిరూన్, వీఏఓ సతీష్‌బాబు పాల్గొన్నారు. పెద్దపప్పూరు మండలం జూటూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ చెంగల్‌రాయుడు, ఏఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాల కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోండి

కణేకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులను చితకబాదిన కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానికులు తహసీల్దార్ ఫణికుమార్, ఎస్ఐ నాగమధుకు వినతి పత్రాలు అందించారు. సదరు కరస్పాండెంట్ సోమవారం ఆరుగురు విద్యార్థులను చితకబాదారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు సంబంధిత కరస్పాండెంట్‌ను పిలిపించుకుని విషయాన్ని ఆరా తీశారు. అలాగే మండల విద్యాశాఖాధికారులు కూడా పాఠశాలకు వెళ్లి విద్యార్థులను విచారించారు.

ఆలయ హుండీ లెక్కింపు

పెద్దపప్పూరు, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అశ్వత్థ నారాయణస్వామి, చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కించారు. తాత్కాలిక, శాశ్వత హుండీల ద్వారా రూ.2,06,996 ఆదాయం వచ్చినట్లు ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి ఆదిశేష నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఉన్నతస్థాయికి ఎదగాలి : సీఐ

కూడేరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సీఐ రాజు సూచించారు. మంగళవారం కూడేరు కస్తూరిబా గాంధీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మహిళ సాధికారితపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే చదువుకోవడంతోపాటు బాల్య వివాహాలను వ్యతిరేకించడం, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు.

చిరుత దాడిలో ఆవుదూడ మృతి

బెళుగుప్ప, మార్చి 04 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి తండాకు కుసుమతికి చెందిన ఆవుదూడ మంగళవారం చిరుత దాడిలో మృతి చెందింది. వ్యవసాయ తోటలో వుండగా దాడి చేసిందని యజమాని తెలపడంతో డాక్టర్ రమేష్, అటవీశాఖాధికారి పెద్దన్న వెళ్లి పరిశీలించి పోస్టుమార్టమ్ నిర్వహించారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కొత్తబస్టాండ్ సర్కిల్‌లో మంగళవారం సీఐటీయూ, భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, బాష, హరి,వెంకటేష్, వెంకి, రాజేష్, వేణు, గురుస్వామి, బండయ్య పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు

పాథమిక వైద్యమే అందించాలి : డీఎంహెచ్ఓ

రాయదుర్గంటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు తమ వద్దకు వచ్చిన రోగులకు ప్రాథమిక వైద్యం మాత్రమే అందించాలని జిల్లా వైద్యాధికారి ఈ. భ్రమరాంబదేవి పేర్కొన్నారు. ఇటీవల బళ్లారి రోడ్డులోని ఓ ఆర్ఎంపీ అందించిన వైద్యం వికటించి రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన పూజారి విజయ్ మృతి చెందిన ఘటనపై మంగళవారం సాయంత్రం ఆమె విచారించారు. మృతుడి కుటుంబసభ్యులతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాయదుర్గం మండలం కొండాపురంలో ఆర్ఎంపీ క్లీనిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా పూజారి విజయ్‌కుమార్ మృతిపై విచారించినట్లు పేర్కొన్నారు. ఆర్ఎంపీలు ఇతర వైద్యసేవలు అందిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ఆర్ఎంపీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు తమ పరిధికి మించి వైద్యం చేస్తే క్లీనిక్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని మాత్రలు, సూదిమందు, టానిక్కులు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి త్యాగరాజు, వైద్య విస్తరణాధికారి గంగాధర్, స్థానిక వైద్యులు రమేష్, యశ్వంత్, జశ్వంత్, అజార్, మాధవ, ఆరోగ్య బోధకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గంగాజలాన్ని తీసుకువస్తున్న అర్చకులు

ఉరవకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో వెలిసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, గణపతి, రుద్రహోమాలను నిర్వహించారు. గవిమఠం సహాయ కమిషనర్ రాణి ఆధ్వర్యంలో కంకణధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గవిమఠం ఆవరణం నుంచి గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి కంకణ మండపంలో మట్టి కుండల్లో మట్టిని వేసి నవధాన్యాలను ఉంచారు. రథోత్సవం ప్రారంభం నుంచి వసంతోత్సవం వరకూ ఆ మట్టికుండలలో మొలకెత్తే ధాన్యాలను బట్టి పంటలు పండుతాయని భక్తుల విశ్వాసం. కార్యక్రమంలో పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం పీఠాధిపతి కల్యాణస్వామి, గవిమఠం ఏజెంట్ రాజన్నగౌడ్, సిబ్బంది నారాయణస్వామి, గోపి, రఘు, పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ : ఏఎస్పీ

యాడికి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి తెలిపారు. మంగళవారం యాడికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న వాటిలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదని సీఐ ఈరన్నను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అత్యవసరమని తెలిపారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపడుతున్న భద్రతా చర్యలపై సీఐతో చర్చించారు. యాడికి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు ఉద్యోగోన్నతి పొందినట్లు సీఐ ఈరన్న తెలిపారు. హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన వారిలో పవన్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి ఉన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం : ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

ఉరవకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గవిమఠం సహాయ కమిషనర్ రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విడపనకల్లు : మండలంలోని హావళిగి గ్రామంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా వాడుకునే ప్రతి ఒక్కరు లేఅవుట్ భూములుగా మార్చుకోవాలన్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టాన్ని రక్షించండి

కణేకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పరిరక్షించాలని జిల్లా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు వసంత్‌కుమార్ ఎస్పీని కోరారు. మంగళవారం పలు సమస్యలపై వికలాంగుల సంఘం నాయకులు రాజేష్, ధనస్వామి, చెన్నమల్లప్ప, గణేష్ తదితరులు ఎస్పీని కలిసి వికలాంగుల సమస్యలను వివరించారు. జిల్లాలో వికలాంగులపై జరుగుతున్న దౌర్జన్యాలు అరికట్టాలని, పోలీస్‌స్టేషన్‌లలో దివ్యాంగుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా ఊరు దేవర

బొమ్మనహాళ్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొల్లాపురమ్మ, మహాలక్ష్మి గ్రామదేవతల ఊరు దేవర మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామస్థులు ఆధ్వర్యంలో ఊరుదేవర నిర్వహించారు. మంగళవారం వేకువజామున కుంభాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అభిషేకించి దున్నపోతును బలిచ్చారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కేపీ వన్నూరుస్వామి, మాజీ సర్పంచ్ కేశప్ప, నాగరాజు, రామస్వామి, మహ్మద్‌రఫీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విషపు నీరు తాగి 24 మూగజీవాల మృతి

బ్రహ్మసముద్రం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన రామన్నకు చెందిన 24 గొర్రెలు పొలంలో విషపు ద్రావణం కలిపిన నీరు తాగి మృతి చెందాయి. 24 గొర్రెలు మృతి చెందడంతో దిక్కుతోచని పరిస్థితిలో రామన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

తాడిపత్రి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లిలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

నాటుసారాను విడనాడండి: ఎక్సైజ్ డీసీ

పామిడి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో నాటుసారాను విడనాడాలని ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య పేర్కొన్నారు. మండలంలోని పాళ్యంతండాలో మంగళవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటుసారా తయారీపై తీవ్రంగా చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా క్రయ విక్రయాలతో జీవితాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. నాటుసారా సేవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. గిరిజన ప్రాంతాలలోని యువత నాటుసారా నిర్మూలనకు నడుం బిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీ మునిస్వామి, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీధరమూర్తి, సీఐ మోహన్ రెడ్డి, ఆర్ఐ విజయ్, ఏపీ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పాళ్యం తండాలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య